క్లుప్తంగా

అప్పన్నకు నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ నేడు

పరవాడ: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేస్తారని జనసేన పార్టీ విశాఖ రూరల్ కార్యదర్శి బుగిడి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటలకు ముత్యాలమ్మపాలెం, 9.15 గంటలకు నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం, 9.45 గంటలకు తిక్కవానిపాలెం, 10.15 గంటలకు వాడచీపురుపల్లి, 11.15 గంటలకు కలపాక, 11.45 గంటలకు గొర్లివానిపాలెం పోర్ట్‌కో లేఅవుట్‌లో పార్క్ ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ.బోనంగిలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేస్తారన్నారు.

మునగ చెట్టుతో అనేక ఉపయోగాలు



తల్లులను సత్కరిస్తున్న పీడీ జయదేవి

పెందుర్తి: మునగచెట్టు మహిళల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ జయదేవి అన్నారు. 'మునగ చెట్టు' మహిళల ఆరోగ్యానికి తొలిమెట్టు కార్యక్రమాన్ని సరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మునగాకులో అనేక పోషకాలు ఉంటాయని అన్నారు. బాలింతలు, గ్రామంలో మహిళలకు మునగ మొక్కలు పంపిణీ చేశారు. పోషకాహర ప్రదర్శన ఏర్పాటు చేసి తల్లులను సత్కరించారు. బాలింతలకు పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శారద, సీడీపీవో నీలవేణి, సూపర్‌వైజర్లు డి.మానస, ఎం.ఎస్.కె ఉష, అంగన్‌వాడీ కార్యకర్త ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దయాల్‌బాగ్ ఉత్పత్తుల ప్రదర్శన

ఆరిలోవ: దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 19 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఐ ఎపెక్ హెడ్ వి.ప్రేమ్ స్వరూప్ తెలిపారు. విశాలాక్షినగర్ డీఏసీ కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఈఐ(దయాల్ బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్) సాత్‌జోన్ ఆధ్వర్యంలో ఉషోదయ కూడలి వద్ద గల ఉషోదయ ఫంక్షన్ హాలులో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. డీఈఐలో చేతి వృత్తుల్లో శిక్షణ పొందిన 52 మంది తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, సుమారు రూ.12 లక్షలు విలువ చేసే ఉత్పత్తులను విక్రయానికి సిద్ధం చేసినట్లు వివరించారు. బ్లాక్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, దివాన్ సెట్లు, పిల్లో కవర్లు, జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన బ్యాగులు, కుర్తాలు, పిల్లల దుస్తులు, తదితరవి ఇక్కడ అందుబాటులో ఉంటాయని, నగర వాసులు వినియోగించుకోవాలని కోరారు. విశాఖ డీఐఈ సెంటర్ ఇన్‌చార్జి దక్షణమూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణ.. వరికి సంరక్షణ



పైడివాడ గ్రామంలో రైతులతో కలిసి వరిలో తెగుళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



బోదువలస వరి క్షేత్రంలో తెగుళ్లను గుర్తిస్తున్న మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తదితరులు

- ఖరీఫ్ వరిచేలకు చీడపీడల బెడద
- తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు
- ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

సబ్బవరం: ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవడంతో వరి పంట పొలాలు బాగున్నాయి. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వరి పంట చిరుపొట్ట దశలో ఉంది. ఈ తరుణంలో ఎరువుల వినియోగంలో అన్నదాతలు సమతుల్యం పాటించడం, సస్యరక్షణ చర్యలు చేపట్టడం ఎంతో అవసరమని వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ దశలో పొటాష్ ఎరువుల వినియోగం తప్పనిసరని తెలియజేస్తున్నారు. పొటాష్ ఎరువు వాడకం వల్ల వరి పంటకు రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా గింజ నాణ్యత బాగుంటుందని, అధిక దిగుబడులు సాధించవచ్చని చెబుతున్నారు. దీనిపై అనేక కార్యక్రమాలు, అవగాహన సదస్సుల ద్వారా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. పొటాష్ ఎరువును ఎకరాకు 20 కేజీల చొప్పున వేసుకోవాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

వరిలో తెగుళ్లు

- ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటపై ప్రధానంగా ఆకు ముడత తెగులు ఆశిస్తుంది.
- పాము పొడ తెగులు పంటల్లో విరివిగా కనిపిస్తుంది.
- ముందుగా వేసిన వరి పంటల్లో సుడి దోమ కూడా కనిపిస్తుంది.

నివారణ చర్యలు

- ఆకు ముడత తెగులు నివారణకు క్లోరిపై పైరో ఫాస్ 2 ఎంఎల్/లీటర్ నీటికి లేదా కార్ టాప్ హైడ్రా క్లోరైడ్ 2 గ్రాములు/లీటర్ నీటికి పిచకారీ చేయాల్సి ఉంటుంది.
- ఎక్సోకోనోజోల్ 2 ఎంఎల్/లీటర్ నీటికి లేదా ప్రొఫీ కోనజోల్ 1 ఎంఎల్/లీటర్ నీటికి చొప్పున కలిపి పిచకారీ చేసుకోవడం ద్వారా పాము పొడ తెగుళ్లను నివారించవచ్చు.
- ముందుగా వేసిన వరి పంటలో సుడిదోమ తీవ్రత అధికంగా కనిపిస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో పంట పొలంలోని మురుగు నీటిని బయటకు తీసి ఎసిఫేట్ 2 గ్రాములు/లీటర్ నీటికి లేదా బుప్రోఫిజిన్ 2 ఎంఎల్/లీటర్ నీటికి పిచకారీ చేయాల్సి ఉంటుంది.
- యూరియాను విచక్షణ రహితంగా వినియోగించడం వల్ల పంట ఏపుగా పెరుగుతున్నట్లు కనిపించినప్పటికీ తెగుళ్ల వ్యాప్తి ఉధృతంగా ఉంటుంది. అవసరం మేరకే యూరియాను వినియోగించాలి.

వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తున్నాం



సుమారు 50 సెంట్ల భూమిలో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం వాతావరణం అనుకూలించి సకాలంలో వర్షాలు పడటంతో పొలాలు నీటి ఎద్దడి లేకుండా ఉన్నాయి. తెగుళ్లు అధికంగా ఆశిస్తుండటంతో నివారణ చర్యలు చేపడుతున్నాం. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు క్రిమి సంహారక మందులను తక్కువ మోతాదులో పిచకారీ చేసాం. ప్రస్తుతం పంట మడులు పొట్ట దశలో ఆరోగ్యంగా కనిపిస్తున్నాయి.

– చీపురబల్లి సూర్యనారాయణ, అమృతపురం, సబ్బవరం మండల

క్రిమి సంహారక మందులు వాడుతున్నాం



1.20 ఎకరాల్లో వరి వేశాను. ఆర్‌జీఎల్ రకం సాగు చేస్తున్నాను. ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. పొలానికి రెండు సార్లు క్రిమి సంహారక మందులు పిచకారీ చేశాను. ప్రస్తుతం తెల్ల సిత్త తెగులు పూర్తిగా నియంత్రణలోకి వచ్చింది. వ్యవసాయ సహాయకురాలు లావణ్య సూచనల మేరకు ఎప్పటికప్పుడు క్రిమి సంహారక మందులు, ఎరువులను వాడుతున్నాను.

– బోకం శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం, సబ్బవరం మండలం

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



ఎరువుల వినియోగంలో సమతుల్యం పాటించాలని రైతులందరికీ గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నాం. చాలా మంది రైతులకు పొటాష్ వినియోగంపై అవగాహన కల్పించాం. తెగుళ్లపై అప్రమత్తంగా వ్యవహరిస్తూ సరైన క్రిమి సంహారక మందులను రైతులు వినియోగించేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పోతల సత్యనారాయణ, వ్యవసాయ అధికారి, సబ్బవరం మండలం

అధ్వానంగా శ్మశానవాటిక

పరవాడ: వాడచీపురుపల్లి శ్మశానవాటికలో దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో మరణాలు సంభవిస్తే మృతదేహాలను పశువుల ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన శ్మశానవాటికలో దహనం చేస్తున్నారు. ఇక్కడ సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా, అధ్వానంగా మారాయి. రుద్రభూమిలో దట్టంగా తుప్పలు పెరగడం వల్ల రాత్రి వేళ దహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో విష జీవులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇక్కడి సమస్యలను, ఇబ్బందులను గుర్తించి శ్మశానవాటికలో పెరిగిన తుప్పలు, డొంకలను తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



వాడచీపురుపల్లి శ్మశానవాటికలో దట్టంగా పెరిగిన తుప్పలు

ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా కల్పిద్దాం

- సీపీ శంఖబ్రత బాగ్చీ పిలుపు
- కోల్ ఇండియా సహకారంతో మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు కుట్టు మిషన్ల పంపిణీ

మద్దిలపాలెం: ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించడంలో దేశంలోనే విశాఖ ఆదర్శనీయంగా నిలిచేలా కృషి చేద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పిలుపునిచ్చారు. కోల్ ఇండియా సీఎస్సార్ నిధులు రూ.2.50 కోట్లతో ఆధునిక కుట్టు మిషన్లను మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అందించడం అభినందనీయమన్నారు. పిఠాపురంకాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ పాల్గొని.. 75 మందికి ఆధునిక కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్లను ప్రతి మహిళా, ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకుని.. ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళలు కుట్టిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. విశాఖలో ట్రాన్స్‌జెండర్లకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర మార్గాల్లో పయనిస్తున్నారని.. దీని ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నగరంలోని ట్రాన్స్‌జెండర్లను గుర్తించి.. వారందరూ ఒకే మార్గంలో నడిచేలా ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రాన్స్‌జెండర్లు కుట్టు శిక్షణ తీసుకోవడం అభినందనీయమని.. వీరిని మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కుట్టు, క్లౌడ్ కిచెన్ రంగంలో శిక్షణ ఇవ్వడానికి తన వంతు కృషి చేస్తానని సీపీ అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లు, మహిళలతో పోలీస్ కమిషనర్ బాగ్చీ, రోటరీ క్లబ్ ప్రతినిధులు

మహిళలకు సమస్యలుంటే 79950 95799కు ఫోన్ చేయండి

మహిళలు వేధింపులకు గురైతే.. తన ఫోన్ నంబర్ 79950 95799కు ఫోన్ చేసి విషయం తెలియజేయాలని సీపీ శంఖబ్రత బాగ్చీ సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. నగరంలో ఉపాధి కోసం సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగినిలు ధైర్యంగా విధులు నిర్వర్తించాలని భరోసా కల్పించారు.

ఏఐ, ఎంఎల్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు

విశాఖ సిటీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ ద్వారా భారీ వేతనాలతో కూడిన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. ఏఐసీటీఈ–వైబ్రెంట్ అడ్వకసి ఫర్ అడ్వాన్స్‌మెంట్ అండ్ నర్చరింగ్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్(వాణి) సహకారంతో ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఐ, ఎంఎల్, డీఎస్‌పై తెలుగులో చర్చా వేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయాన మాట్లాడుతూ 2024 నాటికి వీటి అనువర్తనాలను 75 శాతానికి వినియోగిస్తారని తెలిపారు. ప్రజల్లో వీటి పట్ల విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లక్షలాది నూతన ఉపాధి అవకాశాలను సృష్టించే శక్తి ఈ సాంకేతికతలకు ఉందని వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని దేశ, విదేశీ నిపుణులతో ఏయూ, అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లలో ఏయూ కేంద్రీయ విద్యా సంస్థలైన ఐఐటీల కంటే మెరుగైన స్థానాన్ని సాధించిందన్నారు. సీఎస్ఈ విభాగం ఆచార్యుడు ఎం.శశి మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి నూతన సాంకేతికతలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. మాతృ భాషలో అందరికీ చేరువ చేసే విధంగా కృషి జరపాలన్నారు. దీనికి నాందిగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. ఐటీ విభాగాధిపతి ఆచార్య కుంజం నాగేశ్వరరావు మాట్లాడుతూ సాంకేతికతను స్థానిక భాషతో అనుసంధానించడంతో మెరుగైన అవగాహన కలుగుతుందన్నారు. సీఎస్ఈ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు , సదస్సు సహ సమన్వయకర్త ఆచార్య ఎం.రాంజీ, ఏయూ ఇంకుబేషన్ సెంటర్ సీఈఓ రవి ఈశ్వరపు, విజయ్, సునీల్ ఎస్.రంక తదితరులు పాల్గొన్నారు.

'హిందీ భాషా సాహిత్యాలు'పై చర్చా గోష్ఠి



చర్చా గోష్ఠిలో పాల్గొన్న వీసీ శశిభూషణరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం, విశాఖ హిందీ పరిషత్, అవధి సాహిత్య సంస్థాల సంయుక్త ఆధ్వర్యంలో 'హిందీ భాషా సాహిత్యాలు–ఒక విమర్శ' అనే అంశంపై శుక్రవారం హిందీ భవన్‌లో చర్చా గోష్ఠి జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఏయూ వీసీ శశిభూషణరావు ప్రారంభించి.. హిందీ భాష ప్రాశస్త్యాన్ని వివరించారు. హిందీని నేర్చుకోవాల్సిన ఆవశ్యకతను విశదీకరించారు. విశాఖ హిందీ పరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.ఎం.ఇక్బాల్ సుల్తాన్పూర్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో హిందీని అధ్యయనం చేసిన విద్యార్థులు, విద్వాంసులకు తగిన గుర్తింపు, ఉద్యోగాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హిందీ అధ్యాపకులను కేంద్ర ప్రభుత్వమే నియమించి, వారి జీతభత్యాలను చెల్లించే వ్యవస్థ రావాలని అభిప్రాయపడ్డారు. ఏయూ ఆర్ట్స్, కామర్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, హిందీ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.నరసింహారావు సభకు అధ్యక్షత వహించగా పూర్వ హిందీ విభాగ అధ్యక్షుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నార్వే నుంచి ప్రొఫెసర్ సతీష్‌చంద్ర శుక్ల, యూపీకి చెందిన డాక్టర్ హరినాథ్ శుక్ల, భోపాల్‌కు చెందిన డాక్టర్ ప్రయాస్ జోషి, ప్రొఫెసర్ మహేష్ దివాకర్, డాక్టర్ అర్జున్‌పాండే, ప్రొఫెసర్ జె.విజయభారతి, డాక్టర్ శితం తివారి తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో కానుకల వివాదం

తగరపువలస: బైపాస్ రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆలయ ట్రస్టీ కుసుమహర ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆలయంలో భక్తులు ఇచ్చే కానుకలు దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలతో తమ్మిన వెంకటరావు, రాజగిరి అప్పలరాజు దేవదాయశాఖకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, భీమిలి ఈవో కీర్తి శ్రీనివాసరావు, సంగివలస పోలమాంబ అమ్మవారి ఆలయ ఉద్యోగి కోరాడ శ్రీను విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులను ఆలయానికి పిలిపించిన అధికారులు స్టేట్‌మెంట్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఇరువర్గాల మధ్య స్వల్పంగా తోపులాట చోటు చేసుకుంది. కుసుమహర వర్గానికి చెందిన భక్తులు ఆలయం వద్దకు చేరుకుని దేవదాయశాఖ అధికారులకు మరో స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఏళ్ల క్రితం కుసుమహర పూర్వీకులు దాతల సాయంతో వెంకటేశ్వరస్వామి, విజయదుర్గ ఆలయాలు నిర్మించారన్నారు. దాతలు అందించే అంతంత మాత్రం సాయంతో ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, వారంలో రెండు సార్లు అన్నదానాలు, ఉత్సవాల సమయంలో అన్నదానాలు చేస్తున్నట్టు తెలిపారు. కుటుంబంలోని మనస్పర్థల కారణంగానే ఆలయాలపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అమ్మవారిని దర్శించుకుని ఆలయ నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు చేపడతామన్నారు.

'వెలుగు' సమాఖ్య ఎన్నికలు వాయిదా

- రసాభాసగా మారడంతో నిలిపివేత

సబ్బవరం: మండల వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా సమాఖ్య ఎన్నికలు రసాభాసగా మారడంతో వాయిదా పడ్డాయి. వెలుగు ఏపీడీ జి.డైజీ ఎన్నికల నిర్వహణ పర్యవేక్షకురాలిగా వ్యవహరించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జిల్లా సమాఖ్య ఎన్నికలు జరుగుతాయి. జిల్లాలోని అన్ని మండలాల సమాఖ్య సభ్యులు పాల్గొని వెలుగు జిల్లా సమాఖ్య కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. ఈ మేరకు జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని 24 మండలాల నుంచి హాజరైన మండల సమాఖ్య సభ్యులు జిల్లా సమాఖ్య, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో నర్సీపట్నానికి చెందిన సాయిప్రశాంతిని కార్యదర్శిగా పోటీ చేశారు. కొంత మంది సభ్యులు ఆమె కార్యదర్శిగా పోటీ చేసేందుకు అనర్హురాలంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఎన్నికలు రసాభాసగా మారి ఈ నెల చివరి నాటికి వాయిదా వేశారు.



ఎన్నికల పర్యవేక్షకురాలు వెలుగు ఏపీడీ డైజీ

కార్యదర్శి ఎన్నికపై అభ్యంతరం

ఈ విషయంపై ఎన్నికల పరిశీలకురాలు జి.డైజీ మాట్లాడుతూ కార్యదర్శిగా పోటీ చేసిన సాయిప్రశాంతిని మరో ఎన్‌జీవోలో పనిచేస్తుండటంతో సభ్యులు ఆమె ఎన్నికపై అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. దీంతో ఆమె పోటీ చేసేందుకు అనర్హురాలని తెలియజేశారు. సాయిప్రశాంతిని మాట్లాడుతూ సోషల్ సర్వీస్ చేస్తున్న తనను పోటీ చేయకుండా అడ్డుకోవడం తీవ్ర అన్యాయమన్నారు. తనను అడ్డుకునేందుకు కొంత మంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోరాటం చేసి ఎన్నికల్లో పోటీ చేస్తానని, ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు

సబ్బవరం: పల్లె పండగ–పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు శ్రీకారం చుట్టారు. మండలంలో సుడిగాలి పర్యటన చేసిన ఆయన పలు గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. సుమారు రూ.2.8 కోట్లతో మండలంలోని తవ్వవానిపాలెం, అమృతపురం, పెద గొల్లపాలెం, బాటజంగాలపాలెం, అసకపల్లి, సబ్బవరం–1, బోదువలస, ఎల్లుప్పి, మర్రిపాలెం, గుల్లేపల్లిలో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వాటర్ ట్యాంకుల పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పద్మజ, డ్వామా పీడీ పూర్ణిమా దేవి, కూటమి నేతలు ఇందల రమణ, బలిరెడ్డి అప్పారావు, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, కర్రి కనకరాజు, బోకం స్వామినాయుడు, గండి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గుల్లేపల్లిలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

గ్రామ పంచాయతీల పరిపాలనపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఈవోఆర్డీ ధర్మారావు



హాజరైన ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు

పరవాడ: గ్రామ పంచాయతీల పరిపాలనపై ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు అవగాహన పెంపొందించుకోవలసిన అవసరముందని పరవాడ ఈవోఆర్డీ కె.ధర్మారావు అన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యచరణ–2024–25 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఈవోఆర్డీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిపాలన, పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు, తాగునీరు, పారిశుధ్య వ్యర్థాలు, వీధి దీపాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, పంచాయతీల ఆర్థిక నిర్వహణ, లీగల్ ఎఫైర్స్ అంశాలపై సభ్యులకు శిక్షణ కల్పించామన్నారు. ఈ శిక్షణ తరగతులకు మండలంలోని 15 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణలపై చర్యలు

సబ్బవరం: ప్రభుత్వ భూమి ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. సబ్బవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 277/1ఏలో 9.32 ఎకరాల గెడ్డవాగులో ఆక్రమణలకు పాల్పడుతూ సాగు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. సర్వే నంబర్ 449/9లో 6.07 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలకు పాల్పడినట్లు గుర్తించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తోపాటు సబ్బవరం మండల తహసీల్దార్ చిన్నికృష్ణ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆర్ఐ వీరయ్య, సచివాలయ సర్వేయర్ లోకేష్, ఇతర సిబ్బంది చర్యలు చేపట్టారు.



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ వీరయ్య, సిబ్బంది

రెవెన్యూ సభలను సద్వినియోగం చేసుకోండి

సబ్బవరం: రైతులు తమ రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చిన్నికృష్ణ సూచించారు. మండలంలోని పైడివాడలో శుక్రవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. గ్రామంలోని 168 సర్వే నంబర్లలో 492.89 ఎకరాల జిరాయితీ భూములు, 480.64 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు. వీటికి గాను రీ సర్వే అనంతరం 1821 ఎల్‌పీఎంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రీ సర్వేలో రెవెన్యూ రికార్డుల్లో తమ విస్తీర్ణాల్లో పొరపాట్లు ఉంటే రెవెన్యూ సభల్లో సరిచేసుకోవచ్చని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో పైడివాడ సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గణేష్, వీఆర్వో సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్‌కు ప్రతిష్ఠాత్మకమైన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ గ్రాండ్ జ్యూరీ అవార్డు 2024–25 వరించింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె «సాక్షి»తో ఫోన్‌లో మాట్లాడారు. డిజైన్ థింకింగ్ లీడర్‌గా ర్యాంక్ పొందినట్లు తెలిపారు. రోట్ లెర్నింగ్‌కు మించి ముందుకు సాగడం, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన, సహకారం, సమస్య పరిష్కారం తదితర నైపుణ్యాలను పెంపొందించే బోధన విధానాన్ని అమలు చేయడంలో అసాధారణమైన సామర్థ్యాన్ని గుర్తించి ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ విభాగంలో దేశంలో టాప్ 10లో నిలిచినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ర్యాంకింగ్‌లో విశాఖపట్నం జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో మొదటి స్థానంలో నిలవడంతో ఈ అవార్డు వరించిందన్నారు. కో–ఎడ్యుకేషన్ పాఠశాలల్లో విశాఖ వ్యాలీ స్కూల్ రాష్ట్రంలో టాప్–3లో నిలిచినట్లు వెల్లడించారు. ఈ అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.



న్యూఢిల్లీలో అవార్డు స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరీ ప్రభాకర్